ప్రజాశక్తి
ఆదివారం 23 జులై 2023
5
పార్వతీపురం మన్యం

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాజకీయ పార్టీలకు అతీతంగా ఆదివారం స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో జరగబోయే రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, యువత, మహిళలు, మేధావులు హాజరుకావాలని ఎపి గిరిజనసంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ కోరారు. ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఏర్పాట్లపై చర్చించ జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులపై చేస్తున్న దాడి, అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, చట్టాలు, హక్కులపైన సమావేశమై చర్చిస్తామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అల్టిమేటం ఇస్తామన్నారు. కావున ప్రతి ఒక్కరూ సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్, నాయకులు సన్యాసిరావు, మోహన్‌రావు ఉన్నారు.

సిఆర్‌టిల బదిలీల్లో కిరికిరి

- ఆర్డర్లు ఇచ్చి వారం రోజులైనా తీసుకోని వైనం
- జిఒ 117కు తూట్లు పొడుస్తున్న అధికారులు
- కార్యాలయం అధికారి చేతివాటం

ప్రజాశక్తి - సాలూరు

ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సిఆర్టీల బదిలీల్లో కార్యాలయ అధికారి ఒకరు కిరికిరి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 117కి తూట్లు పొడిచే ప్రయత్నాలు సాగిస్తున్నారనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. నిబంధనల ప్రకారం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులనే నియమించాలి. లేకుంటే 50ఏళ్లు పైబడిన పురుష ఉపాధ్యాయులను నియమించవచ్చు. 35ఏళ్లలోపు పురుష ఉపాధ్యాయులను బాలికల పాఠశాలల్లో నియమించ కూడదనే నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. అయితే ఐటిడిఎ కార్యాలయం అధికారుల చేతివాటంతో జీవో 117ను నీరుగార్చే ప్రయత్నాలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల సిఆర్టీల బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్‌లో వారికి నచ్చిన ప్రదేశాలను ఎంపిక చేసుకున్నారు. దాని ప్రకారం వారం రోజుల క్రితం ఆర్డర్లు కూడా ఇచ్చేశారు. ఈ విధంగా కొంతమంది సిఆర్టీలకు సాలూరు మండలంలోని కురుకూటి, అంటివలస, మావుడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను కేటాయించారు. ఆరుగురు స్కూల్ అసిస్టెంట్ సిఆర్టీలకు వారు కోరుకున్న పాఠశాలలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసి వారం రోజులైంది. అయితే ఆ సిఆర్టీలు ఇంకా బదిలీ ఉత్తర్వులు తీసుకోకుండా తాత్సారం చేయడం అనుమానాలకు తావిస్తోంది. ఐటిడిఎ పిఒ, గిరిజన సంక్షేమ డిడిలకు తెలియకుండా కార్యాలయం అధికారి ఒకరు ఇష్టారాజ్యంగా డెప్యుటేషన్‌పై వారికి ఇష్టమైన పాఠశాలలకు పంపించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తెరవెనుక పైరవీలు చేసుకుని నచ్చిన పాఠశాలలకు డెప్యుటేషన్ వేయించుకునేందుకు బదిలీ ఉత్తర్వులు తీసుకోకుండా జాప్యం చేస్తున్నారు. అదే విధంగా బదిలీ ఉత్తర్వులు తీసుకున్న నలుగురు ఎస్‌జిటి సిఆర్టీలు కూడా వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరకుండా పైరవీలు మొదలు పెట్టినట్టు సమాచారం. ఆర్.త్రినాధరావు, డి.విజయకుమారి, ఎస్.మానస, ఎం.వెంకటరావు, కె.నాగ మణి, ఎం.వెంకటరావు అనే సిఆర్టీ స్కూల్ అసిస్టెంట్లకు బదిలీ ఉత్తర్వులు జారీ చేసినా తీసుకోకుండా జాప్యం చేయడం వెనుక ఆ కార్యాలయం అధికారి అండదండలే కారణమని తెలుస్తోంది. అలాగే పి.గౌరీశంకరరావు, ఆర్.శ్రీనివాసరావు, కందుల సోములు, కుమారి అనే ఎస్‌జిటిలు ఆర్డర్లు అందుకున్నా వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరలేదు. బాలికల పాఠశాలల్లో యువకులైన సిఆర్టీలను నియమించకూడదనే నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ అధికారులు పక్కదారి పట్టించే ప్రయత్నాలు గత కొంతకాలంగా చేస్తున్నారు. ఇప్పుడు అదే తరహా ప్రయత్నాలను కార్యాలయం అధికారి చేస్తుండడంపై గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

జిల్లా కేంద్రానికి చేరుకున్న ఇవిఎంలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కేంద్రానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంలు) చేరుకున్నాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇవిఎంలను భద్రపరిచేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన భవనంలో భద్రపర్చారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులతో కలిసి అనేక సార్లు భవనాన్ని పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఇవిఎంలు గోడౌన్ ఖరారు చేశారు. ఎన్నికల సంఘం 3,170 కొత్త బిఎల్‌ఎం3 ఇవిఎంలు, వివిపిఎటిఎస్‌ను కేటాయించింది. ఈ వారం చివరి నాటికి జిల్లాకు చేరుకోనుంది. విశాఖపట్నం నుండి 3,600 బ్యాలెట్ యూనిట్లు (బి.యులు), 1500 కంట్రోల్ యూనిట్లు (సియులు), కాకినాడ నుండి 1250 సియులు కూడా కేటాయించారు. ఇవిఎంలను పరిశీలించేందుకు ప్రతినిధులను పంపించాలని, వారి సమక్షంలోనే గోడౌన్ తెరవడం జరుగుతుందని జిల్లా యంత్రాంగం అన్ని రాజకీయ పార్టీలకు సూచించింది. విశాఖపట్నం నుంచి జిల్లాకు కేటాయించిన ఇవిఎంలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. కలెక్టర్‌తో పాటు ఎస్‌పి విక్రాంత్‌పాటిల్, డిఆర్‌ఒ జె.వెంకటరావు ఇవిఎంల స్వీకరణ ప్రక్రియను శనివారం పర్యవేక్షించారు. పార్టీల ప్రతినిధులు పరిశర్ల అప్పారావు , గొట్టపు వెంకట నాయుడు (టిడిపి) తదితరులు హాజరయ్యారు.

కొత్తగా వచ్చిన ఇవిఎలంను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జిల్లా ప్రగతిపై శాఖల పనితీరు ప్రభావం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ శాఖల పనితీరు జిల్లా ప్రగతిపై ప్రభావం చూపుతుందని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శనివారం ఐసిడిఎస్ సిడిపిఒలతో వీడియో కాన్ఫరెన్స్ .సంపూర్ణపోషణ, గర్భిణులకు పౌష్టికాహారం, తక్కువ బరువు గల పిల్లలు, నాడు-నేడు పనులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో లబ్దిదారుల హాజరు నమోదు శాతం 40-50కు తగ్గడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాజరు నమోదు కాకపోవడానికి చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవని, జిల్లా నుంచి పంపిస్తున్న కనీస స్థాయి సూచిక నివేదికల వల్ల రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రగతి పై ప్రభావం చూపుతుందని తెలిపారు. గర్భిణులకు అందిస్తున్న సంపూర్ణపోషణ, బరువు తక్కువ పిల్లల హాజరు, ఆధార్ అప్గ్రేడేషన్ పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. నాడు-నేడు ద్వారా చేపడుతున్న భవన నిర్మాణ పనులకు నిధులు కొరతలేదని, సకాలంలో నిధుల విడుదలకు స్టేజివారీగా నిర్మాణ పనులను సంబంధింత యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. భవన నిర్మాణ పనులను పరిశీలన చేసేందుకు రోజువారీ నివేదికను పంపించాలని తెలిపారు. నివేదికలను మూడో పార్టీతో పరిశీలనచేసి, తప్పు నివేదికలను పంపిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గర్భిణులు, బరువుతక్కువ పిల్లలు, పౌష్టికాహార లోపం గల పిల్లలు వివరాలు ప్రతి సచివాలయంలో అందుబాటులో ఉండాలని, సచివాలయ సిబ్బంది వారికి అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందేటట్లు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. సమావేశంలో ఐసిడిఎస్ పిడి కె.విజయగౌరీ, జిల్లాలోని సిడిపిఒలు, సూపర్లు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో డ్రయర్ల ఏర్పాటు తప్పనిసరి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ధాన్యం తేమ శాతం తగ్గించేందుకు జిల్లాలో గల 95 రైసు మిల్లులలో తప్పని సరిగా డ్రైయర్లు ఏర్పాటు చేయాలని, సిసి కెమెరాలు, స్టార్టెక్స్ మిషన్స్ ఏర్పాటు చేయాలని, రైసు మిల్లుల రిజిస్ట్రేషన్ చేయించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు సూచించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశమందిరంలో శనివారం సివిల్ సప్లయి అధికారులు, రైసు మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు కావాల్సిన గోనె సంచులు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు రావాల్సిన రవాణా, లేబర్, గోనెసంచులు, ధాన్యం సొమ్ము తప్పనిసరిగా రైతు అకౌంట్లో జమ చేయాలన్నారు. ప్రతి రైతు పంట వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో ఆన్లైన్ చేయించాలని, రైతు భరోసా కేంద్రాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ చేసిన తప్పిదాల వల్ల రైతు నష్టపోతున్నారని అన్నారు. అలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మిల్లర్లకు ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు త్వరలో వచ్చే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజరు దేవుళ్ల నాయక్, జిల్లా సప్లయి అధికారి శివప్రసాద్, మిల్లర్ల ప్రతినిధులు కె. రమేష్, శివ, అబ్బాయిబాబు, రైసు మిల్లర్లు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మణిపూర్ ఘటనలకు నిరసనగా ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి - పార్వతీపురంరటౌన్/బెలగాం

మణిపూర్లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి మోడీ పూనుకోవాలని, హింసను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచకశక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, శ్రామిక మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాజు, కార్యదర్శి పి. రాజశేఖర్ మాట్లాడారు. గత మూడు నెలల నుండి మణిపూర్లో మైతే, కుకి తెగల మధ్య మొదలైన హింసకాండ వల్ల 150 మంది హత్య చేయబడ్డారని, ప్రతి రోజు మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని, అనేకమంది కుకి తెగకు సంబంధించిన గిరిజనుల ఇళ్లను తగలబెట్టారని, ఇంత విధ్వంసం జరుగుతున్నా ప్రధాని మోడీ కనీసంగా స్పందించకపోవడం చూస్తే మణిపూర్లో జరుగుతున్న హింస కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండదండలతో జరుగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కార్గిల్ అమరవీరుల భార్యను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం అనంతరం హత్యచేసిన ఘటనకు భారతదేశం తలదించుకునేలా ఉందని, మోడీ సిగ్గుపడాలని అన్నారు. ఇలా బయటకు రాకుండా జరిగిన అనేక అఘాయిత్యాలకు మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. నేడు మత కలహాలుగా మారి చర్చిలు తగలబెడుతూ, క్రిస్టియన్ ఫాస్టర్లను చంపుతున్నారని, ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం బీజేపీ హిందుత్వ ఎజెండాలో భాగంగానే జరుగుతుందన్నారు. తక్షణం అల్లర్లకు పాల్పడే అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకుని మాణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మేధావులు, ప్రజాస్వామికవాదులు, దేశ సమైక్యతను కోరుకునేవారు తక్షణం మోడీ ప్రభుత్వ మతోన్మాద చర్యలను ఖండించాలని, లేకపోతే మణిపూర్ ప్రయోగం దేశవ్యాప్తంగా బీజేపీ, ఆరెస్సెస్ విస్తరణకు పూనుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సింహాచలం, ఐద్వా వెంకటమ్మ, గౌరి, జానకి, సంతోషి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో మానవహారం చేస్తున్న విద్యార్థులు, మహిళలు, నాయకులు

పాలకొండ, పాలకొండ రూరల్: మణిపూర్ లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి మోడీ పూనుకోవాలని, హింసను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు పాలకొండ సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ అవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ తక్షణమే అల్లర్లకు పాల్పడే అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకుని మాణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మేధావులు, ప్రజాస్వామికవాదులు, దేశ సమైక్యతను కోరుకునేవారు తక్షణం మోడీ ప్రభుత్వ మతోన్మాద చర్యలను ఖండించాలని, లేకపోతే మాణిపూర్ ప్రయోగం దేశవ్యాప్తంగా బీజేపీ, ఆరెస్సెస్ అమలుచేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు, ఆటో కార్మిక సంఘం ప్రతినిధులు కె. రామకష్ణ, కె.సూర్య, బి.పోలినాయుడు, బి.దుర్గారావు, ఎన్.శ్రీను, టి. దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బుక్కూరులో...

మణిపూర్ మహిళలపై హింసను ఆపాలని ఐద్వా బుక్కురు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.హిమప్రభ మాట్లాడుతూ మణిపూర్ మారణ హెూమాన్ని ఆపాలని, మహిళలపై అమానుష ఖండపై పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, మే 4న అఘాయిత్యం జరినప్పటికి సోషల్ మీడియాలో వైరల్ అయినంత వరకు ఒక్కరిని కూడా అరెస్ట్ చేయకపోవడం శోచనీయమైన చర్య అని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మౌనం వీడి మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.పద్మావతి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: మణిపూర్‌లో గత మూడు నెలలుగా జరుగుతున్న మారణహెూమంపై రాష్ట్రానికి చెందిన అధికార, ప్రతిపక్షాలు ఎందుకు నోరు మెదపడంలేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు అన్నారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలు, మహిళల అత్యాచారాలు, నగ్నంగా ఊరేగింపు లు జరుగుతుంటే టిడిపి, వైసిపి, జనసేన అధినేతలు మౌనం వహిస్తుండడం సరికాదని చెప్పారు. బిజెపి అడుగులకు మడుగులొత్తే పనిలో వున్న ఎపి రాజకీయ పార్టీలు వున్నాయని అన్నారు. కులం,మతం పేరుతో ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్న బిజెపి ప్రభుత్వం మణిపూర్ హింసాత్మక సంఘటనలకు బాధ్యత వహించాలని, ఆ రాష్ట్ర సీఎం రాజీనామా చేయాలని ఎన్వై నాయుడు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఉమాశంకర్ పాల్గొన్నారు.

జైకా నిధులు ఏమయ్యాయి?

- పెదంకలాం ఆనకట్ట కాలువ పనులు ఎందుకు పూర్తికాలేదు?
- 26న కలెక్టర్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - బలిజిపేట

పెదంకలాం ఆనకట్టు పునులకు జైకా నిధులు మంజూరైనా ఎందుకు పనులు పూర్తి చేయాలని రైతు సంఘం నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు ఈనెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా తలపెట్టామని, ఈ కార్యక్రమంలో రైతులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రజాసంఘాల ఆధ్వర్యాన రైతు సంఘం రైతుల ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు బద్దన భానుమూర్తి, నల్ల ఈశ్వరరావు మాట్లాడుతూ పనుకువలస, అరసాడ, పెదమాయివలస, రాయవలస, నారాయణపురం, వెంగాపురం, చెల్లింపేట, తుమరాడ, బలిజిపేట, పలగర, చిలకలపల్లి, వెంగళరాయపురం, చంద్రంపేట, ఇరువాడ, మరువాడ, కోనంగిపాడు. గీతనా తదితర గ్రామాల పరిధిలో 8000 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక అంకలాం కాలువ అభివృద్ధి పేరుకే తప్ప ఈ నాలుగేళ్లలో చుక్క నీరు ఇవ్వలేదన్నారు. మూడేళ్ల కిందట మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆర్భాటంగా జైకా నిధులు రూ.18కోట్లుతో పనులు ప్రారంభించినా ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. కనీసం నాయకులు, అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఖరీఫ్ సీజన్ రావడం వల్ల తప్పని పరిస్థితుల్లో రైతులు గండ్లు పూడ్చుకోవల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇటీవల రైతు సంఘం నాయకులు తలపెట్టిన పరిశీలన నేపథ్యంలో అనేక సమస్యలు బయటకు వచ్చేయని, ఆనకట్ట దగ్గర షట్టర్లు కూడా సక్రంగా లేవని, ఎక్కడపడితే అక్కడ గండ్లు ఉన్నాయని, కాలువ మొత్తం పూడిక పేరుకు పోయిందని తెలిపారు. ఈ సందర్భంలో కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ఈనెల 26 కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నామని, ఈ ధర్నాకు రైతులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలినాయుడు, నారాయుడు, అప్పలస్వామి, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చండి : డిఇఒ

టీచర్ సస్పెన్షన్... ఏడుగురికి మెమోలు

ప్రజాశక్తి - పాచిపెంట

విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపర్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు బోధన డైరీలను ముందుగా పరిశీలించారు. విద్యార్థులకు పుస్తకాల పంపిణీపై ఆరా తీయగా, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు లెస్సన్‌ప్లాన్‌కు సొంతానికి నోట్స్‌పుస్తకాలను వినియోగించుకోవడాన్ని గుర్తించారు. దీనిపై ఆగ్రహం చెందిన డిఇఒ ఆమెను సస్పెండ్ చేశారు. అలాగే దినసరి ప్రణాళిక, లెస్స ప్లాన్ సక్రమంగా లేకపోవడంతో ఏడుగురు ఉపాధ్యాయులకు మోములు జారీ చేశారు. అనంతరం జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం భోజనం రుచికరంగా వండి పెట్టాలని సిబ్బందికి సూచించారు

ఓటరు పరిశీలనలో వాలంటీర్లు ఉండొద్దు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - బలిజిపేట/సీతానగరం

ఓటరు పరిశీలన ప్రక్రియలో వాలంటీర్ల సేవలు వినియోగిం చరాదని ఆర్‌డిఒ కె.హేమలత స్పష్టం చేశారు. ఇంటింటి ఓటరు సర్వే ప్రక్రియలో భాగంగా బలిజిపేట మండలం పెదపెంకిలో 209, 210, 220 పోలింగ్ కేంద్రాలు, సీతానగరం మండలం చినభోగిలలో 154, 111 పోలింగ్ కేంద్రాల పరిధిలో శనివారం ఆమె పరిశీలించారు. ఇంటింటి ఓటరు సర్వే ప్రక్రియ పక్కాగా జరగాలన్నారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) వాలంటీర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇందులో భాగస్వామ్యం చేయరాదని ఆదేశించారు. అలా వినియోగిస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు క్రమశిక్షణా చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. జూలై 21 నుండి ఆగస్టు 21వ వరకు బూత్ స్థాయి అధికారులతో ఇంటింటా ఓటరు వివరాల విచారణ జరుగుతుందని అన్నారు. ఆగస్టు 22 నుండి సెప్టెంబరు 29 వరకు ఓటరు కార్డుపై ఫోటో మిస్ మేచింగ్, క్లారిటీ లేకపోవడం, పోలింగ్ కేంద్రాల మార్పు వంటి అంశాలను పరిశీలన ఉంటుందన్నారు. సమగ్ర ముసాయిదా జాబిత సెప్టెంబరు 30 నుండి అక్టోబరు 16 వరకు జరుగుతుందని చెప్పారు. ముసాయిదా జాబితా అక్టోబరు 27న ప్రచురించడం జరుగుతుందని, అక్టోబరు 17 నుండి నవంబరు 30 వరకు అభ్యంతరాలు, క్లైమ్ లు సమర్పించవచ్చు అని ఆమె అన్నారు. 2023 అక్టోబరు 1నాటికి, 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి అయి అర్హత కలిగిన యువత ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భామిని : సచివాలయం ఆవరణలో చేపడుతున్న ఇంటింటి సర్వేలో భాగంగా బిఎల్‌ఒలు ఇంటింటికి వచ్చి ఓటర్ సర్వే చేపడతారని తహశీల్దార్ ఎన్.అప్పారావు అన్నారు. 18 ఏళ్లు నిండి వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలు చందన, ప్రమోద్, గోపాల్, డిప్యూటీ తహశీల్దార్ శేఖరం, గ్రామస్తులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని బిఎల్‌ఒలంతా ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా పరిశీలిస్తున్నారని ఆర్‌ఐ మండంగి కృష్ణ అన్నారు. గరుగుబిల్లిలో చేపడుతున్న సర్వేను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్వోలు మండల అధికారులు ఓటర్ల జాబితా పరిశీలనకు సంబంధించి సమావేశాలు నిర్వహించారు. ప్రత్యేక ఓటరు జాబితా పునశ్చరణపై ఇంటింటికి వెళ్లి ఓటరు ధ్రువీకరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ తుమరాడ నాగరాజు, విఆర్‌ఒ గంట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : బిఎల్‌ఒలతో ఓటర్ పరిశీలన చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ బూతు లెవెల్ ఏజెంట్లకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బూత్ లెవెల్ ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ సూచించిన ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంపై బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత టౌన్ అధ్యక్షులు పప్పల మహేష్, బల్ల హరి, యూనిట్ ఇంచార్జ్ తూముల రమేషు, సీనియర్ నాయకులు జామి సింహాచలం, జలుమూరు ప్రవీణ్ కుమార్, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

సీతానగరంలో ఇంటింటి ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

అశాంతి... ఆందోళనలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రజానీకం ఒకింత అశాంతితోనూ, ఆందోళనతోను ఉన్నారు. నిరసన కార్యక్రమాలు పెల్లుబుకుతుండడం ఇందుకు తార్కాణమని పలువురు ఉదహరిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఇవేవీ పట్టించుకోవడం లేదు. ఎవరి దారి వారిది అన్నట్టుగా జగనన్న సురక్ష, నియోజకవర్గాల సమీక్ష, తదితర కార్యక్రమాలతో కాలక్షేపం చేస్తోంది. దీంతో, సమస్యలు మరింత జఠిలమైన ఆందోళనలు తీవ్రతరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో ముందుకు వచ్చిన అంశాలను ఒక్కసారి పరిశీలిస్తే... జీడి, చెరకు రైతులు మద్ధతు ధర కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ మాటలకు చేతలకు పొంతన కదురడం లేదని జనం చర్చించుకుంటున్నారు. తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటూనే రైతులకు మద్ధతు ధర, మార్కెటింగ్ సదుపాయం లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది క్రితం రైతు బజార్లతో దుకాణ అద్దెలు సైతం ప్రభుత్వం అమాంతంగా పెంచేసిందంటూ గుర్తు చేస్తున్నారు. వేతనాలు పెంచాలంటూ జిల్లా వ్యాప్తంగా విఆర్‌ఎలు నిరవదిక నిరాహార దీక్షలు, ధర్నాలు చేపట్టిన సంగతి తెలిసిందే. రూ.10,500 ఎలా సరిపోతాయని, ఈ వేతనాలతో కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టతరంగా మారిందని చెబుతున్నారు. దీనికితోడు సంక్షేమ పథకాలు సైతం వర్తింపజేయకపోవడంతో ఆర్థికంగా తీవ్ర అవస్థలు పడుతున్నామని వారి వాదన. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆగస్టు 7న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 25న విజయవాడలో నిరసన దీక్షలు చేస్తామని కూడా హెచ్చరిస్తున్నారు. మరోవైపు తమకు పాఠపుస్తకాలు ఇవ్వాలంటూ ఇంటర్ విద్యార్థులు రోడ్లు ఎక్కారు. వీరికి మద్ధతుగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు కూడా జరిగాయి. చాలా కాలంగా ఎదురు చూస్తున్న మెడికల్ కాలేజీ సాకారమైన తరుణంలో 50శాతం సీట్లు విక్రయానికి పెట్టడంతో వైద్య వృత్తికోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. నాడు - నేడు పనులు ముందుకు సాగకపోవడంతో చాలా స్కూళ్లలో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల సమస్యతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. రూ.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో గుత్తేదారులు కూడా ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలు జరిగాయంటూ ఉపాధ్యాయులు కూడా ఆందోళన బాటపట్టారు. మునుపెన్నడూ లేని విధంగా రాజకీయ కక్షలతో జిల్లాలోని ఓ ఉపాధ్యాయుడ్ని హతమార్చడంతో ఉపాధ్యాయులతోపాటు జిల్లా ప్రజానీకం ఉలిక్కిపడింది. ఇలా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ప్రభుత్వం తమ జీవితాలతో చలగాటమాడుతోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తునారు.

సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆటో కార్మికులు ఐకమత్యంగా ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆటో కార్మికులంతా ఐకమత్యంతో ఉండాలని సిఐటియు నాయకులు వి.ఇందిర, గొర్లి వెంకటరమణ అన్నారు. శనివారం కొత్తవలస వద్ద గల టౌన్ రైల్వే స్టేషన్ దగ్గర కొత్తగా ఏర్పడిన శ్రీ సత్యనారాయణ స్వామి ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జెండా వారు ఎగురవేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఆటో వర్కర్లంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధారలు తగ్గించాలని, స్వయం ఉపాధి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆటో వర్కర్లను పన్నుల భారం నుంచి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం యూనియన్ అధ్యక్షులుగా జి.చరణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శంకర్రావు, కార్యదర్శిగా దుర్గారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పట్టణ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్న, ప్రసాద్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మలేరియాకు మందుల్లేవు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా మందుల్లేవని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలో మరిపల్లి పంచాయతీ పెదాలవలసలో శనివారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యంతో మంచాన బాధపడటం ప్రభుత్వాసుపత్రిలో మందుల్లేవని, ఉన్న అరకొర మందులతో చాలీచాలని డాక్టర్లు, సిబ్బంది తో వైద్యం నిర్వహిస్తున్నారని అన్నారు. ఇదేవిధ ప్రజలు కళ్ల కలకలతో బాధపడుతున్నారని, వసతి గృహాల్లో విద్యార్థులు అయితే రోజులు తరబడి పాఠశాలలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి వుందని వారి చదువులు ఎలా ముందుకు సాగుతాయని ప్రశ్నించారు. కనీసం వర్షాకాలంలో ముందు జాగ్రత్త చర్యలను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, బూసా తవుడు, మత్స శ్యామ్‌సుందర్, నడిమింటి రామకృష్ణ, కొల్లిన గోపాల్, తొట్టడి సూరరాజు, కె.వెంకట రమణ, బురి అప్పన్న, బొర్రన్న దొర పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బేబినాయన, వేణుగోపాల్

మృతుడు కుటుంబానికి అండగా టిడిపి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెద పెంకిలో 2019 ఎన్నికల అనంతరం ఎన్నికల ఫలితాలు విషయంలో గొడవలు పడిన మృతి చెందిన దత్తి వెంకట్రావు కుటుంబానికి టిడిపి రూ.2లక్షలు, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బేబినాయన రూ.50 వేలు, మండల పార్టీ అధ్యక్షులు పెంకి వేణుయాడు రూ.50వేలు కలిపి మొత్తం రూ.3 లక్షలు ఆర్థిక సహాయాన్ని బేబీ నాయుడు సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, సీనియర్ నాయకులు పెంకి రామ్మోహన్ నాయుడు, గొట్టపు వెంకటనాయుడు, రాంబాబు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై ప్రభుత్వం స్పందించాలి

ప్రజాశక్తి - కురుపాం

మంగళగిరిలో జరిగిన గిరిజన బాలిక అత్యాచార సంఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని టిడిపి యువనేత వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజనుల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందనగా ఒక పక్క సిఎం సంక్షేమ పాలన ప్రజలకు నేరుగా అందిస్తున్నా మంటున్నారని ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గిరిజనులపై ఇలాంటి ఘటనలు ఈ మధ్య కాలంలో ఎక్కువ అవుతున్నాయని, దీనికి ఖచ్చితంగా ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రాష్ట్రంలో గిరిజనులకు శాంతిభద్రతలు కరువయ్యాయని తెలిపారు. ఈ ఘటనపై సిఎం కమిటీ ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

గొట్టివలస మాజీసర్పంచ్ మృతి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

నారాయణస్వామి

గొట్టివలస మాజీ సర్పంచ్ బోను నారాయణస్వామి(80) శుక్రవారం రాత్రి మృతి చెందారు. గడిచిన కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణస్వామి చికిత్స పొందుతూ మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. గొట్టివలస గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సుదీర్ఘ సేవలందించారు. అలాగే గ్రామాభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేశారు. నారాయణస్వామి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంపిపి ఉరిటి రామారావుతో వైసిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే టిడిపి నాయకులు వీరేశ్ చంద్రదేవ్ తోపాటు,అరకు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), ద్వారపురెడ్డి చంద్రశేఖర్, కండెన బలరామనాయుడు, గంట నాగరాజు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి తమప్రగాఢ సంతాపమును తెలియజేశారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో తూరాయిపువలస సమీపంలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానంలో శనివారం కొంతమంది దాతలు సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం టిటిడి కల్యాణ మండపంలో ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికంగా వచ్చారు. దాతలు ముందుకు రావాలని అర్చకులు కోరారు.

శరవేగంగా కిచ్చాడ బిటి రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కిచ్చాడకు కొత్తగూ జోగిరాజు పేట నుండి వెంకటాపురం రూ.కోటి 42లక్షలతో 2.800 కిలోమీటర్ల బిటి రహదారి నిర్మాణ పనులు సర్పంచ్ జి.రాజ్యలక్ష్మి, అయ్యరకుల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ చంద్రశేఖర్ శనివారం దగ్గరుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలమైతే గుంతలు, బురదమయమైన రహదారితో అత్యవసర సమయంలో ప్రయాణం చాలా కష్టంగా ఉండేదని రహదారి సదుపాయం లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు చూసిన ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి బిటి రహదారి నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపి మంజూరు చేయించి పనులు శరవేగంగా జరగడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.

జోగిరాజుపేట -వెంకటాపురం మధ్య జరుగుతున్న రోడ్డు పనులు

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు : ఎమ్మెల్సీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని నీలానగరంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాలకొండ వైస్ ఎంపిపి కడపాక సూర్య ప్రకాష్, సర్పంచ్ వావిలపల్లి పురుషోత్తమరావు, బెవర అప్పలనాయుడు, మంగిపూడి రాంబాబు, వావిలపల్లి వేణుగోపాలనాయుడు, బొత్స సన్యాసి నాయుడు, మజ్జి తవిటి నాయుడు, రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 295 మంది లబ్దిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే వసన నందివాడలో మండల ప్రత్యేక అధికారి పి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వావిలపల్లి పురుషోత్తమ నాయుడు, బొమ్మలు సరోజిని, కె.సన్యాసినాయుడు, తహశీల్దార్ సి.హెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ జయంతిప్రసాద్, ఏఓ ఎస్.మారుతీరావు, ఎంపిటిసి బొమ్మల సూర్య ప్రకాష్, సచివాలయ కార్యదర్శులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పెదబోగిలి ఒకటి, రెండు గ్రామ సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను అక్కడే పరిష్కరించే దిశగా కృషి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిటిసి సభ్యులు ఎస్.గౌరి, బురిడి కుసుమ, సర్పంచి జొన్నాడ తేరేజమ్మ, ఎంపిడిఒ ఎంఎస్ఎల్‌వి ప్రసాద్, తహశీల్దార్ ఎవి రమణ, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడం ద్వారా సురక్ష కార్యక్రమం ప్రతి కుటుంబానికి రక్షగా మారిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని నర్సిపురంలో సచివాలయం -1,2 నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆర్జీదారులకు మంజూరు చేసినటువంటి 11రకాల అధికారిక ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపిలు సిద్ద జగన్నాథరావు, బంకూరు రవికుమార్, జెడ్పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, ఎంపిడిఒ ఎస్.రమేష్, తహశీల్దార్ శివన్నారాయణ, స్థానిక సర్పంచ్ చెరుకుపల్లి బంగారమ్మ, పిఎసిఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, వైసిపి సీనియర్ నాయకులు వెంపలి గురురాజు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని కేసలిలో సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల్లో రాజన్న దొరను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, సర్పంచ్ ప్రతినిధి, సత్తరపు రాము, కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, గండిపల్లి రాము, సింహాచలం, ఎంపిడిఒ జి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని కందులపదంలో జగనన్న సురక్ష కార్యక్రమం వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావాల్సిన ధ్రువపత్రాలు ప్రజంతా ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ కల్లేపల్లి త్రినాథ్‌నాయుడు, ఎంపిడిఒ ఎ.రమాదేవి, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, భరత్ శ్రీనివాసరావు, తాడంగి కన్నంనాయుడు గృహ సారథులు, కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: జియమ్మవలస మండలం పెద్దబుడ్డిడి సర్పంచి శీమల సుజాత ఆధ్వర్యాన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలు అందని వారుంటే వారిని గుర్తించి అందించడం జరుగుతుందని తెలిపారు. కొత్తగా మంజూరైన ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి రేవళ్ల జ్యోతి, ఉపసర్పంచి తిరుపతిరావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు శీమల బాబు మోహన్ రావు, శ్రీను తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జగనన్న సురక్ష పథకం మండలంలోని ప్రతి ఒక్కరికీ ఉపయోగపడాలని తహశీల్దార్ జె.రాములమ్మ కోరారు. మండలంలోని చినగీశాడ సచివాలయంలో జగనన్న సురక్ష గ్రామసభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జగదీష్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఎఇ కె.మురళీధర్‌రావు, హౌసింగ్ ఎఇ రెడ్డి శ్రీనివాసరావు, సచివాలయం ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తియాత్రలో పాల్గొన్న టిడిపి మహిళా నాయకులు

మర్రిపాడులో భవిష్యత్తు గ్యారెంటీ యాత్ర

ప్రజాశక్తి - సీతంపేట

భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి యాత్ర శనివారం మండలంలోని మర్రిపాడులో నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మేనిఫెస్టో ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మహాశక్తి ప్రచారకర్త తోయక సంధ్యారాణి అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి యాత్ర మహిళ నేతలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రతి కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి స్త్రీనిధి కింద నెలకు రూ.1500 నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15వేలు అందిస్తుందన్నారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తుందని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా స్థానిక బస్సుల్లో మహిళలందరికీ టికెట్టు లేని ప్రయాణ సౌకర్యం కలిగిస్తుందని, నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలిస్తుందని తెలిపారు.ప్రతి నిరుద్యోగికి యువగళం నిధి కింద నెలకు రూ.2500 ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఆరిక సువర్ణ, నిమ్మక రోజా, నిమ్మక దమయంతి, కుండంగి సావిత్రి, వరలక్ష్మి, పార్వతి, స్వాతి, బంగారమ్మ, లక్ష్మి, సీతమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలపై జగన్‌రెడ్డి రాజకీయం తగదు

ప్రజాశక్తి - బలిజిపేట

నేతన్నలపై జగన్ రెడ్డి నీతిలేని రాజకీయం చేస్తున్నారని అరుకు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు బి.రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడిపి హయంలో అమలు చేసిన పథకాలు రద్దుచేసి ఆప్‌కో ద్వారా కొనుగోలు నిలిపివేశారని, మాస్టర్ లివర్స్ నుంచి కొనుగోలు లేకుండా నూలు రంగులపై సబ్సిడీని రద్దు చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంహెచ్‌డిపి కింద ఇచ్చే సబ్సిడీలు, పట్టు పరిశ్రమలకు ఇచ్చే సబ్సిడీలు రద్దు చేశారన్నారు. టిడిపి హయాంలో చేనేత వృత్తికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చేందుకు చర్యలు తీసుకుని సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సాహకాలిస్తే జగన్‌రెడ్డి హయాంలో నేతన్న నేస్తమా అనే దగా తప్ప ఇంకేమీ లేదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు యూనిఫాం చేనేత కార్మికుల నుండే కాకుండా పవర్ లూమ్ నుండి కొనుగోలు చేసేలా ఏకంగా బైలాసులో మార్పులు చేసి చేనేతలను దగా చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గం అధికార ప్రతినిధి మండల పెదపాపినాడు తదితరులు పాల్గొన్నారు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఐటిడిఎ పరిధిలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైనమెరుగైన వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ నాయకులు పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకష్ణ, రొబ్బ లవరాజు కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ఈ సీజన్లో ప్రతి విద్యార్థి కళ్ల కలకలు, ఇతర రోగాల బారిన పడి అనారోగ్యంతో బాధపడుతున్నారని అన్నారు. కావున ప్రతి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో పనిచేసిన ఆరోగ్య సిబ్బందిని తిరిగి విధుల్లో తీసుకోవాలన్నారు. గుమ్మలక్ష్మీపురంకు మంజూరైన డైట్ కళాశాలను ప్రారంభించి, కొమరాడ గిరిజన గురుకుల బాలురు పాఠశాలలో ఇంటర్మీడియట్ కళాశాల ఏర్పాటు చేయాలని, కురుపాం గిరిజన ఆశ్రమ పాఠశాల గురుకుల పాఠశాల కళాశాలలో అదనంగా భవనాలు, కురుపాం, కొటికిపెంట, అనసబద్ర ఏకలవ్య పాఠశాల కళాశాలు పూర్తి స్థాయిలో భవనాలు నిర్మాణాలు చేపట్టి ఆశ్రమాల్లాల్లో పనిచేయుట నాన్ టీచింగ్ సిబ్బందిని వెంటనే వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - బెలగాం

పట్టణంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని జనసేన నాయకులు వంగల దాలి నాయుడు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో గల కమిషనర్ జె.రామప్పల నాయుడును కలిసి వినతులు అందిస్తూ మాట్లాడారు. ప్రస్తుతం రోగాల సీజన్ ప్రారంభమైనందున దోమల నివారణకు పై ప్రత్యేక దృష్టి సారించాలని, మున్సిపాలిటీలో ఉన్న 30 వార్డులతో పాటు పట్టణ సమీపంలోని కొత్తగా ఏర్పడిన కాలనీల్లో సైతం దోమల నివారణ కోసం ఎబెట్, ఏసియన్ ఐదు శాతం తదితర మందులు పిచికారీ చేయించాలన్నారు. అలాగే ప్రతిరోజు ఫాగింగ్ కార్యక్రమం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనికి స్పందించిన కమిషనర్ దోమల నివారణకు, పారిశుద్ధ్య పనులకు తగు చర్యలు చేపడతామన్నారు..

గ్రామస్తులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు మోహనరావు

తాగునీరు అడిగితే నిందలా?

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తాగేందుకు నీరు అడిగితే జనసేన కార్యకర్తలపై ఎమ్మెల్యే అలజింగి జోగారావు జనసేనపార్టీపై నిందలు, నిర్బంధాలకు పాల్పడడం తగదని జనసేన పార్వతీపురం నియోజకవర్గ నాయకులు అక్కివరపు మోహన్‌రావు అన్నారు. మంచినీటి కొరతపై గ్రామస్తులు ఎమ్మెల్యేను అడ్డుకోవడం జరిగిన విషయం విదితమే. ఈ సమస్య పరిష్కరించకుండా జనసేనపై ఎమ్మెల్యే ఎదురుదాడి చేయడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన గ్రామస్తులను, జనసేన కార్యకర్తలను కలిశారు. అనంతరం మోహనరావు మాట్లాడుతూ మండలంలోని డికె పట్నంలో కొన్నేళ్లుగా తాగునీటి సమస్య ఉందని, దీనిపై గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే జోగారావు వద్ద ప్రస్తావించారని, నాలుగేళ్లుగా ఈ సమస్యను పరిష్కరించకపోవడంతో నిలదీశారన్నారు. దీంతో ఎమ్మెల్యే గ్రామస్తులను బెదిరించడమే కాకుండా ఆ గ్రామానికి పుష్కలంగా మంచి నీరు ఉందని, కావాలనే జనసేన పార్టీ మా పై బురద చల్లుతున్నారని సోషల్ మీడియా వేదికగా అనడంతో నేడు జనసేన నాయకులు ఆ గ్రామంలో పర్యటించి మంచి నీటి సమస్యను ప్రజల ద్వారా వెలికి తీయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆగూరు మణి, చిట్లు గణేష్, గౌరీ శంకర్, జయశంకర్, జయప్రకాష్, చంద్రశేఖర్, మణికంఠ, పవన్, దుర్గ, అల్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రోడ్డు

ప్రజాశక్తి- సీతంపేట

గిరిజన ప్రాంతం అభివృద్ధికి అన్ని గ్రామాల్లో రోడ్లు వేస్తున్నట్టు ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలో దొనుబాయి ప్రధాన రహదారి నుంచి చిన్నరామ జంక్షన్ వరకు కొత్తగా ఏర్పాటు చేసిన బిటిరోడ్ ఉపాధి హామీ నిధులు ద్వారా రూ.50లక్షలు అంచనా వ్యయంతో గిరిజన సంక్షేమ ఆధ్వర్యంలో నిర్మించిన బిటి రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ రహదారితో గ్రామస్తులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్‌రావు, జడ్పిటిసి ప్రతినిధి సవర రాము, వైస్ ఎంపిపిలు, స్థానిక సర్పంచ్ సవర మౌనిక, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

రహదారి ప్రారంభం

పాలకొండ రూరల్: మండలం డోలమడ జంక్షన్ నుంచి వంతవాడకు ఉపాధిహామీ నిధులు రూ.2.20కోట్లు అంచనా వ్యయంతో నిర్మించిన బిటి రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు కణపాక సూర్య ప్రకాష్, వాకముడి అనిల్, రణస్థలం రాంబాబు, బిడ్డిక వెంకయ్య, పాండ్రంకి హైమావతి, ఉపేంద్ర, గొర్లి కష్ణ, రాజారావు, వాసు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పులిపుట్టి గ్రామ సచివాలయ పరిధిలో పులిపుట్టి పంచాయతీ వెంపలగూడ, రేగులగూడ, పాత రేగులగూడ, కె.గుమ్మడ, బిల్లమడలో గడప గడప - మన ప్రభుత్వం" కార్యక్రమంలో ఎమ్మెల్యే గడప గడపకు ప్రజల వద్దకు వెళ్లి, సంక్షేమ పథకాలు వస్తున్నాయా, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది ఇంటి ఇంటికీ వచ్చి సంక్షేమ పథకాలు వివరాలు తెలియజేస్తున్నారా అని గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకుంటూ, ప్రతి ఇంటికి అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డక ఆదినారాయణ, పాలకొండ ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్‌రావు, జెడ్పిటిసి ప్రతినిధి సవర రాము, వైస్ ఎంపిపి కుండంగి సరస్వతి, స్థానిక సర్పంచ్ సవర బాజన్న, స్థానిక ఎంపిటిసి సభ్యులు సవర సరోజినీ, సవర తవిటిరాజు, పెద్దూరు సర్పంచ్ హిమరక ఆదిలక్ష్మి, సీతంపేట సర్పంచ్ ఆరిక కళావతి, సచివాలయ కన్వీనర్ బలగ త్రినాధరావు, గొర్లె ఫకీర్, సవర సోమేశ్వరరావు, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా రామారావు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా జంజేటి రామారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. చిన్నమేరంగి కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేసిన ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో కళాశాలకు రాగా, సీతానగరం జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేసిన తెర్లి రవికుమార్ పార్వతీపురం కళాశాలకు బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీరురువురికి ఇంతవరకు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించిన సీనియర్ లెక్చరర్ ఆకుల రాజుతో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డిఐఒ జగన్మోహన్

గర్భిణుల వైద్య సేవలపై డిఐఒ ఆరా

ప్రజాశక్తి - మక్కువ

గర్భిణులు, కిశోర బాలికలు, ఐదేళ్లలోపు పిల్లల్లో రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. శనివారం ఆయన వెంకటబైరిపురాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గర్భిణుల గృహ సందర్శన చేసి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య వివరాల నమోదుపై సిబ్బందిని ఆరా తీశారు. ప్రతినెలా గర్భిణులకు అందిస్తున్న ఐరన్, కాల్షియం మాత్రలు సక్రమంగా ఎమ్సిపికార్డ్‌లో విధిగా నమోదు చేయాలని, సిబ్బందికి సూచించారు. అలాగే గర్భిణులు వాటిని వినియోగిస్తున్న విధానంపై ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. అలాగే ఎంత మంది ఐదేళ్లలోపు పిల్లలకు ఐరన్ సిరప్ వేస్తుందని, ఆ వివరాల నమోదుపై డిఐఒ ఆరా తీశారు. ఇళ్ల వద్ద ఐరన్ సిరప్ లభ్యతపై తల్లిదండ్రులను అడిగారు. వారానికి రెండు సార్లు క్రమం తప్పకుండా ఐరన్ సిరప్ 6 నెలల నుండి ఐదేళ్లలోపు పిల్లలకు వైద్య సిబ్బంది వేయించాలన్నారు. ఆశా మొబైల్ అప్లికేషన్స్‌లో నమోదు వివరాలు పరిశీలించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన హిమోగ్లోబిన్ రక్త పరీక్షల నిర్వహణను డిఐఒ పర్యవేక్షించారు. హిమోగ్లోబిన్ శాతం నమోదు వివరాలు పరిశీలించి తక్కువగా గుర్తించిన విద్యార్థులతో మాట్లాడి రక్తహీనత లక్షణాలు పరిశీలించారు. క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కిశోర బాలికల్లో రక్తహీనత నివారించే దిశగా వైద్య సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ ప్రభాకర్, సూపర్ వైజర్ జయగౌడ్,వైద్య సిబ్బంది భారతి,విజయ్ కుమార్,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో యువక్లబ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో యువ పర్యాటక క్లబ్‌కు శ్రీకారం చుట్టారు. పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రాచుర్యాన్ని కల్పించడం తద్వారా పర్యాటక ప్రదేశాల విశేషాలు విద్యార్థులకు తెలియజేసి పిల్లల్లో నైపుణ్యం, పరిశుభ్రత, వివిధ కార్యక్రమాలు చేయడంలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు యువ పర్యాటక క్లబ్‌లు దోహదపడతాయి. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ విద్యాసంస్థలలో ప్రారంభించాలని సూచించడం, ఆ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావడం జరిగింది. ఇందులో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో యువక్లబ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.భీముడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మన పండగలు, జాతరలు, కళారుపాలపై ప్రస్తుతం యువతకు, భావితరాల వారికి తెలియజేసేందుకు నేటి యువత వాటిపై డాక్యుమెంట్ చేసి అవగాహన పెంపొందించు కోవాలన్నారు. యువ క్లబ్బుల వల్ల విద్యార్థులకు నైపుణ్యం పెంపొందుతుందన్నారు. యువ క్లబ్‌ల ఆవశ్యకత వివరించారు. జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యత వివరించారు.విద్యార్థినీ విద్యార్థులు వేసవి సెలవుల్లో వివిధ పర్యాటక ప్రదేశాలను పర్యటించి వీడియోగ్రఫీ చేయడం, జిల్లా పరిసర ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రదేశాలను గుర్తించి వాటి చరిత్ర ఫోటోలను జతపరిచి ఒక డాక్యుమెంట్ తయారు చేయాలని సూచించారు. యువక్లబ్‌లు ఇందుకు బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణ రావు పర్యాటక యువ క్లబ్ ఏర్పాటును అభినందించారు. అన్ని విద్యా సంస్థలలో ఏర్పాటుకు చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.మురళీధర రావు, ఎ.సూర్య ప్రకాశరావు, జి.శ్రీహరి, ఎన్.త్రినాథరావు, బి.కూర్మారావు, కె.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

290 లీటర్ల మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సుమారు 34 కేసుల్లో 290 లీటర్లు, వైన్సు, నాటు సారా మూడు కేసుల్లో సుమారు 14 లీటర్లు ఇన్ఫోర్స్మెంట్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఆర్.సుధాకర్, సిఐ స్వామినాయుడు, స్థానిక ఎస్సై ఎన్ ప్రశాంత్ కుమార్ సమక్షంలో ఈ మద్యాన్ని ధ్వంసం చేశారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉండొచ్చని అధికారులు అంచనా చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ పాణిగ్రహి, సిబ్బంది రామకష్ణ, సతీష్, శ్రీను, రామలక్ష్మి ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సీజ్ చేసిన వాహనాలు వేలం పాట

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలను శనివారం పార్వతీపురం సిఐ సిహెచ్ స్వామినాయుడు, ఎన్ఫోర్స్మెంట్ ఇన్‌ఛార్జి ఆర్.సుధాకర్ సమక్షంలో మండల ప్రజల సమక్షంలో వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాన్ని రూ.13 వేలుకు బండి రవికుమార్ దక్కించుకొన, త్రిచక్రవాహనాన్ని రూ.10500 బెవర గోవిందా సొంతం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఎన్ ప్రశాంత్ కుమార్, ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు